# పొద్దుపొడుపు

'అమ్మగోరూ, వసంతమ్మగోరూ,' మేఘగర్జనలాంటి ఆ అరుపుకు వసంత, శరత్ ఒకేసారి ఉలిక్కి పడ్డారు.

'ఇదేమిటి, వసూ, ఈ టైంలో కూడా మనల్ని డిస్టర్బ్ చేయాలా, తెల్లారిందంటే ఎవరిపనులలో వాళ్ళం మునిగిపోక తప్పదు.' అంటున్న శరత్ మళ్ళా అతగాని అరుపులాంటి పిలుపుకి అదిరిపడ్డాడు. 'తలుపు తీస్తానుండండి.' చిరునవ్వుతో లేచింది వసంత.

'వద్దు వసూ, వచ్చినవాడెవరో మన అంతం చూసేలాగున్నాడు. గొంతే ఇంత కటువుగా వుంటే వాడి చేతిలో కత్తులూ కటారులూ వుండవని నమ్మకం ఏమిటి!' శరత్ గొంతుతో పాటు శరీరం కూడా వణుకుతోంది.

'మీరింత పిరికివారు ఎప్పుడైపోయారండీ, బాబూ, ఆ వచ్చింది మన నారాయణే నండి' అంటూ తలుపులు తెరిచింది వసంత. సరాసరి లోపల గదిలోకే వచ్చేసాడు నారాయణ. వాడి కళ్ళు చింతనిప్పులులా వున్నాయి. ఆవేశంలో ఊగిపోతూ వసంతపైకి ఉరుకుతున్నాడు. శరత్ మరింతగా కంపించి పోతూ "నువ్వు ఇప్పుడు ఇక్కడికెందుకొచ్చేవు, ఈ వింత చేష్టలేమిట్రా? పిచ్చెక్కిందేమిటి?"

"మాటలు జాగ్రత్తగా రానీండి బాబూ. వెర్రీ పిచ్చీ ఎక్కి ఈదులలో ఈరాంగం ఏస్తున్నదీ ఈ ఆడాళ్ళే" శరత్‌కి విషయం బోధపడిపోయింది.

'ఇదన్న మాట పీడి చిందులకి కారణం' అనుకున్నాడు. వసంత వంటింట్లోకి వెళ్ళి ఓ పెద్దగ్లాసుడు మజ్జిగ తీసుకొచ్చి నారాయణ ముందుంచింది. 'ఇది తీసుకో, కాస్త స్థిమితపడు, అన్నీ మాట్లాడదాం,' అని కుర్చీలో కూర్చుంటూ, భర్తను కూర్చోమని సైగచేసింది.

'ఏటమ్మా మాట్టాడేది. ఇన్నాళ్ళూ మా ఆడోళ్లకి మొగుళ్ళంటే దేవుళ్ళు. ఏ పొద్దూ యెదురు సెప్పేరా? కొట్టినా తిట్టినా సచ్చినట్లు పడుండేవోళ్ళు. మీ సదువుకున్న ఆడోళ్ళంతా కలిసి మా ఓళ్ళ బుర్రలు తినేసేరుకదా. ఆళ్ళందరికి నాయకురాలివి నువ్వంట. ముందు నీ సంగత్తేలిస్తే తప్పా మిగిలినోళ్ళంతా వల్లకుంటరేటి? పొద్దంతా ఒళ్ళూనం చేసుకొని కట్టబడేటోళ్ళం పొద్దుగూకేసరికి మందేసుకుంటేసుకంగుంటది పేనం. మద్దెలో మీకేటైపోనాది. మేము తాగటానికీల్లేదని మందు దుకాణాలెత్తెయ్యాలని ఊరూరా తిరిగి గోలెడతారా, ఈ పాలి మా జోలి కొచ్చారంటే ఏటి సేత్తామో మాకే తెలదు, నీకిదే సెప్తున్నా; కిం అనకుండుండు' వచ్చినంత

ఆవేశంగానూ వెనుతిరిగాడు.

'ఆగు! నీమనస్సులో ఉన్నదంతా వెళ్ళబోసి వెళ్ళిపోవటం కాదు. నేను చెప్పేది కూడా వినిపించుకో" గంభీరంగా పలికిందామె స్వరం. నారాయణ టక్కున ఆగిపోయాడు.

వసంత వాగ్దాటి కాదు; ఆమె అతనికి చేసిన ఎన్నో ఉపకారాలు, ఆమె వల్ల అతడు పొందిన ఎంతో మేలు; అతన్ని కూర్చోబెట్టాయి. తండ్రి తాగుడికి బానిసై సంపాదించినదంతా ఖర్చుచేసేసేవాడు. పసితనంలోనే తల్లిని పోగొట్టుకున్న నారాయణ, గౌరి; తిండి గుడ్డల కోసం ముఖం వాచి తిరుగుతుండేవారు. అవసరం లేకపోయినా ఏదోపని కల్పించి ఆ ఇద్దరినీ తన ఇంట చేర్చుకుని వాళ్ల ఆలనాపాలనా నిజానికి తనే చూసేది. నారాయణకి చెల్లెలంటే ప్రాణం. తను అయ్యలా చెయ్యకూడదు. ఏదైనా పని నేర్చుకుని డబ్బు కూడ బెట్టి చెల్లికి మనువు చెయ్యాలి- అనుకునేవాడు. కష్టపడి వడ్రంగం నేర్చుకున్నాడు. వసంత చల్లని నీడలోనే పెరిగారిద్దరూ. తన నేస్తగాడితోనే గౌరికి మనువు కుదిర్చాడు. అప్పుడూ చేతిలో పైసలాడకపోతే తాళి బొట్టు దగ్గర్నించీ వసంతే సర్దింది. ఎంతో సంబరంగా దాన్ని అత్తవారింటికి పంపడానికి ఈ అమ్మే కారణం. అవన్నీ గుర్తుకొచ్చిన అతను చల్లారిన ఆవేశంతో వసంత మాటలు వినసాగాడు.

"మీ ప్రాణానికి సుఖం ఇచ్చే మందు మేం వద్దంటున్నామని నువ్వింత కోపగించు కుంటున్నావు. దుకాణాలెత్తించేయటానికి పాటుపడుతున్నామని నీకోపం కదూ, చూడు నారాయణా; మీరనుకున్నట్లు ఈ తాగుడు మీ ప్రాణాలకి సౌఖ్యం ఇవ్వదు, సరికదా; ఎన్నో ప్రాణాలను తీస్తుంది."

"అదిగో, ఆమాటలంటేనే నాకు సిర్రెత్తిపోతాది. సుక్కేసుకున్నంత మాత్రాన మేం ఓరి ప్రాణాలు తీయటం లేదమ్మా. ఆలీ, బిడ్డలకి ఏటి తక్కువ చేసాం, అల్ల బాగోగులు మాం సూసుకోటం నేదా, ఏదో గొప్ప పనులు సేసేమని పేపర్లో పొటో యేయించుకోవటానికి మా మందు దుకానాలే దొరికాయా? ఆట్ని మూయించేత్తే మీరంతా మా గొప్పపన్లు సేసినట్టా, నానేదీ పదేపదే సెప్పను. మల్లీ ఇట్టాంటి గొడవలెట్టకండి."

"నిదానించు నారాయణా, నేను చెప్పేది పూర్తిగా విను. మాకేం ఊసుపోక ఈ పని చెయ్యటంలేదు. మీకు తెలియకుండానే మీ బ్రతుకులు నాశనం చేసుకుంటున్నారు. ఈ తాగుడుతోనేగా మీ అయ్య మిమ్మల్ని పట్టించుకోవడం మానేసాడు! చిన్నపుడు ఎంతో కష్టపడి పనీపాటా నేర్చుకుని సంపాదించగానే నువ్వు ఇలాగే తయారయ్యావుకదా! ఓ విషయం నీకు గుర్తుందా? గౌరీ నీ నేస్తగాణ్ణి చేసుకొని బాధ పడలేదూ, వాడూ తాగుతాడని! దాన్ని పువ్వుల్లో పెట్టి చూస్తాడని హామీ ఇచ్చేసి నువ్వు దాని మాట సాగనివ్వలేదు."

వసంత గౌరి మాట ఎందుకు ఎత్తిందో అర్థం కాలేదు నారాయణకి. "ఇప్పుడు గౌరికేటయిపోనాది? మా బావయ్య నిసాలో అప్పుడప్పుడు ఓ(రెండు సుట్లుసెయ్య సేసుకున్నా

ఆడుదాన్ని బానే సూసుకుంటున్నాడు. బుడుతడుట్టిండు గంద."

నవ్వింది వసంత. "పిల్లాడ్ని కంటే సంతోషంగా ఉన్నట్టేనా? తప్పతాగి పెళ్లాన్ని తన్నేవాడు ప్రేమగా చూసుకున్నట్టేనా? నువ్వూ ఆ కోవకు చెందిన వాడివేకదా, అలానే మాట్లాడతావు. కానీ నీకొక విషయం తెలియదు. మన కూనలతో పాటు ఈడి మేళం కూడా మనకేల అని నువ్వు నీ భార్యని సాధిస్తున్నావే, నీ చెల్లెలి కొడుకుని కూడా రెక్కలు ముక్కలు చేసుకుని లచ్చి ఎందుకు పెంచుతోందో ఆలోచించావా? అంతా నీ బావ చేసిన నిర్వాకం! పచ్చిబాలింతరాన్ని తాగుడు మైకంలో చితక్కొట్టి ప్రాణం మీదకి తెచ్చాడు. పాపం ఆ పిచ్చిపిల్ల నిన్నే కలవరిస్తూ చచ్చిపోయింది. నువ్వు టైఫాయిడ్ జ్వరంతో మంచాన ఉన్నావని తెలిస్తే ఏమయిపోతావోనని అమాయకురాలు లక్ష్మి ఆ విషయం దాచి నీ తిట్లు సాధింపులు భరిస్తోంది."

నారాయణకి ఇంకేం వినిపించటం లేదు."నా సెల్లి గౌరి తల్లి సచ్చిపోయిందా?" అంటూ గుండెలు బాదుకుని ఏడ్వ సాగాడు.

"ఏడ్చి ఏం లాభం! ఇలాంటి గౌరిలు, సీతలు, లచ్చిలు ఎందరో? నీ చెల్లేకాదు, నీ ఆడదాని జీవితం కూడా ఇలాగే ముగిసిపోవచ్చు."

నారాయణ కళ్లు తుడిచేసుకున్నాడు. దిగ్గున లేచి నిలబడ్డాడు. "అట్టా జరగదమ్మా, నా లచ్చిని నేను ఏటీ అనను. నా బిడ్డలతో పాటు గౌరి కొడుకుని కూడా సక్కగా పెంచుతాను. పైసాపైసా కూడదీసి సదివిత్తాను. పాడు తాగుడు జోలికి పోను. మీరంతా మాసక్కని పనిసేత్తున్నారు తల్లీ. నా బోటోల్లు బావుంటే కల్లకి మందు కనిపించ కూడదమ్మ. నన్ను సెమించు వసంతమ్మా. ఇంటికి పోయి లచ్చిని కూడా సెమించమని అడుగుతా. వెళ్తున్న నారాయణ వైపు చూస్తూ తృప్తిగా ఊపిరి పీల్చుకుంది.

"వసూ, నారాయణ మారినట్టేనా?"

" చెల్లెల్ని పోగొట్టుకున్నాని తెలిసి అతని మైకం వదిలింది. యథార్థాన్ని వాళ్ల ముందుచటం అందుకోసం శ్రమించటం మనకి సామాజిక బాధ్యతండి."

"అమ్మో, నాకు క్లాసు తీసుకోకు, కాస్సేపు నిద్రపోనీ." అవలిస్తూ మంచంపైన వాలాడు.

★ ★ ★

"పొద్దుపొడిచింది. ఇంకేం నిద్ర! నారాయణ మనస్సులో కూడా కొత్తపొద్దుపొడిచింది!" అనుకుంటూ వంటింట్లోకి నడిచింది వసంత.